కథా కౌముది



# ఎవరు నేర్పేరమ్మ.. బాడిశ హన్మంతరావు

ఆ రోజు ఆదివారం, సమయం ఉదయం తొమ్మిది. అందరికీ సెలవు కావడంతో కాలనీ అంతా పిల్లలతో సందడిగా ఉంది. ఉదయం బ్రేక్ ఫాస్ట్ అవ్వడమే ఆలశ్యం, ఒక ఇంటిలోనుండి బ్యాటు, మరో ఇంటిలో నుండి బంతి, మరో చోట నుండి స్టంప్స్ ... అలా అన్నిరకాల ఆయుధాలు బయటికి వస్తాయి. ఆసక్తి లేని కొంతమంది టివీల ముందే గడుపుతుంటే, మరికొంతమంది సైకిల్స్, బైక్ లు తీసుకొని కాలనీ లోని అన్ని రోడ్లూ గిరాగిరా తిరుగుతూనే ఉంటారు. మాకూ ఒకే పుత్ర రత్నం పేరు చిన్నా. అయిదవ తరగతి చదువుతున్నాడు. ఇంటి ముందు వాలుకుర్చీలో కూచొని, చేతుల్లో గడ్డం పెట్టుకొని, ఇంటి ముందునుండి వెళ్తున్న పిల్లలను చూస్తున్నాడు.

"ఏరా చిన్నా ! ఫ్రెండ్స్ రాలేదా, బయటికి వెళ్ళట్లేదు" అన్నాను.

"లేదు నాన్నా, సూరీ, సాయి వాళ్ళు ఈ రోజు ఊరెళ్ళారు" జవాబిచ్చాడు.

వాడి జవాబును వింటూనే, పేపర్ కి చూపు అతకేశాను. కొద్ది సేపు తరువాత చూస్తే, వాడి చూపు రోడ్డుకు అటు ఇటూ పెండ్యులంలా తిరుగుతోంది. వాడి చూపునసరించి చూస్తే, ఆ చూపు సైకిల్ తొక్కుతున్న ఇద్దరు పిల్లల దగ్గరకు చేరుకుంది. ఆ పిల్లలు హుషారుగా ఉన్నారు, సైకిల్ తొక్కడాన్ని ఎంజాయ్ చేస్తున్నారు.

"నాన్నా, నాకు సైకిల్ నేర్పుతావా?" ఉన్నట్లుండి అడిగాడు చిన్నా.

మా ఇంట్లో కూడా ఒక సైకిల్ ఉంది. అది వాడి మొదటి పుట్టినరోజుకి వచ్చిన బహుమతుల్లో వాడికి బాగా నచ్చిన బహుమతి. వాళ్ల పెద్దమ్మ ఇచ్చింది. పసుపు రంగుతో, మూడు చక్రాలతో, ముందు బుట్టతో, బటన్ వత్తితే వచ్చే గంటల శబ్దంతో చాలా ముద్దుగా ఉండేది. అన్ని భాగాలు, ఖండానికొక్కటి పడే దాకా దానితో చెడుగుడు ఆడాడు. వాడికి మరో రెండు పుట్టిన రోజులయ్యేసరికి, దాన్ని ఎవరూ సైకిల్ అనలేని విధంగా చేశాడు.

" వీడికి సైకిల్ అంటే చాలా ఇష్టం కామోసు" అనుకొని వాడికి అయిదోదో, ఆరోదో పుట్టిన రోజుకి వాళ్ల పెద్దమ్మ మరో సైకిల్ తెచ్చింది. పెరిగే వాడు కదా అని, కాస్త ఎత్తుగా ఉన్నదీ తెచ్చింది. దాని వెనుక చక్రానికి సపోర్ట్ గా అటూ , ఇటూ రెండు చిన్న చక్రాలు ఉన్నాయి. దాన్నీ చాలా రోజులు తొక్కాడు.

ఫరవాలేదు బాగానే తొక్కుతున్నాడు గదా అనుకున్నాను. ఇక తొక్కగలడులే అని ఒకానొక మంచి రోజు, సపోర్ట్ గా ఉన్న చిన్న చక్రాలు తీసేశాను. ఆ మరుసటి రోజు ఆ సైకిల్ తొక్కబోయి కాళ్లు అందక కింద పడ్డాడు. మోకాలిపైన గాయం అయింది. అంతే... ఆ సైకిల్ చిరునామా, నైరుతి మూలలో ఉన్న స్టోర్ రూముకి మారింది. ఇది జరిగింది రెండేళ్లయింది.ఇప్పటిదాకా మళ్ళీ దాన్ని ముట్టింది లేదు.

మళ్ళీ ఇన్నాళ్లకి దాని ప్రస్తావన వచ్చింది.

-0-

"నాన్నా, సైకిల్ నేర్పుతావా?" మళ్ళీ అడిగాడు. వాడు అడిగిన తీరుకి, అదేదో విఠలాచార్య సినిమాలో కమండలంలోని నీళ్లు తీసుకొని చేతితో చల్లి, వరమిచ్చే సాధువు మాదిరిగా,'నీకు సైకిల్ తొక్కడం వచ్చును గాక " అని వరమిచ్చేయలనిపించింది.

కానీ ఎలా?

"సరే , అలాగే" అనడమే ఆలస్యం, వాడు పరుగెత్తుకెళ్ళి, స్టోర్ రూమ్ తాళపు చెవులు తెచ్చాడు. ఇద్దరమూ కలిసి సైకిల్ ని బయట ప్రపంచంలోకి తీసుకొచ్చాము. అది దాదాపు అవసాన దశలో ఉంది.

"దీన్ని బాగు చేయిద్దామా? కొత్తది తెచ్చుకుందామా?" కొత్త సైకిల్ కొంటే ఎంతవుతుందో మనసులో అంచనా వేస్తూ అడిగాను.

" కొత్తది ఎందుకు నాన్నా? బాగు చేయిద్దాం. కావాలంటే సైకిల్ తొక్కడం వచ్చింతరువాత గేర్ సైకిల్ కొందాం. మా క్లాసులో హరిగాడికి ఉన్నట్టాంటిది. మహా.. వాడికే ఉన్నట్టు పెద్ద ఫోజు కొడుతుంటాడు" ప్రస్తుతానికి అభయమిచ్చినట్టే ఇచ్చి, పనిలో పనిగా భవిష్యత్ ప్రణాళిక చెప్పాడు.

ఇద్దరమూ వాళ్ల అమ్మకి చెప్పి బైక్ మీద బయటపడ్డాము. ఊరంతా తిరిగినా ఎక్కడా సైకిల్ షాపులు తీసి లేవు. అవును మరి, వాళ్లకి మాత్రం సెలవు వద్దా? చివరికి ఎక్కడో బైపాస్ దగ్గరలో ఒక చెట్టు క్రింద సైకిల్ షాపు, చిన్న డబ్బా లాంటిది తీసి ఉంది. దాన్ని చూస్తూనే "అదిగో... సైకిల్ షాపూ" అరిచాడు మావాడు. షాపతన్ని అడిగి, ఇంటికి వచ్చి అతి కష్టం మీద పాతసైకిల్ ని అక్కడికి చేర్చాము.

షాపు వాడు దాన్ని చూస్తూనే దగ్గరకి వచ్చాడు. టైర్లు, ట్యూబ్ లు, చైన్, ఫ్రీవీల్,సెంటర్ వీల్, యాక్సిల్, ఫోర్కు అంటూ సైన్స్ స్టూడెంట్ లాగా అన్ని భాగాల పేర్లు చదివాడు. తరువాత ఇవి బాగున్నాయి, ఇది ఫరవాలేదు, ఇది మార్చాల్సిందే అంటూ... గబాగబా నోటి లెక్కలేసి "ఓ వెయిరూపాయల దాకా అయితది సార్" అన్నాడు.

"కొత్త సైకిల్ ఎంతవుద్ది?" అడిగాను.

"ఇప్పుడన్నీ రేట్లు పెరిగినయ్ సార్, నాలుగువేల చిల్లర అవుతుండొచ్చు"

"గేర్ సైకిల్ అయితే ఎంతవుద్ది?" చిన్నా ప్రశ్న.

"గేర్ సైకిలా? మన దగ్గర దొరకదు, సిటీ నుండి తెప్పించుకోవాలి. తక్కువలో తక్కువ పదివేల దాకా అవ్వచ్చు".

ప్రస్తుతానికి బాగు చేయించడమే బెటరనుకొని

" సరే మరి, బాగు చేసి ఎప్పటికిస్తావ్?" అడిగాను.

"సాయంత్రం నాలుగు కల్లా అయిపోద్ది సార్"

"మరి సామాన్లు ఎక్కడ తెస్తావ్, ఆదివారం గదా?"

"నా దగ్గర స్పేర్ పార్ట్స్ ఉంటాయ్ సార్,"

" మంచి క్వాలిటీవి వెయ్యి, సెకండ్ హాండ్ వి వేసేవ్?" ... హెచ్చరికలు చెప్పి, అతని ఫోన్ నెంబర్ తీసుకొని ఇంటికి వచ్చాము.

"మమ్మీ! నా సైకిల్ సాయంత్రానికి రెడీ" ఇంట్లోకి వస్తూనే అరిచాడు చిన్నా. వాడికి వాళ్లమ్మను మమ్మీ అని, నన్ను నాన్నా అనీ పిలవడం అలవాటు.

వాడు ఇంట్లో ఉన్నాడన్న మాటే కానీ, వాడి మనసంతా రాబోయే సైకిల్ చుట్టే తిరుగుతోంది. వాడి మైండ్ లో ఉన్నది పసిగట్టినట్లు, ఓ చానల్లో 'ది ఫ్లయింగ్ స్కాట్స్ మన్' ఇంగ్లీష్ మూవీ వస్తోంది. దాంట్లోనూ సైకిలే. ఆ సినిమా చూస్తూనే, గోడ గడియారం వైపు మాటి మాటికీ చూస్తున్నాడు. చిన్నముల్లు, పెద్దముల్లు మధ్య నూట ఇరవై డిగ్రీల కోణం ఏర్పడింది.

" నాన్నా.... నాలుగైంది!" పెద్దగా అన్నాడు చిన్నా.

" అవును గదా, మరచే పోయాను" అంటూ షాపతనికి ఫోన్ చేశాను.

" సార్, గంటాగి రండి, అయిపోతుంది" చెప్పాడు. మావాడికి అదే విషయం చెప్పాను.

"అదేంటి, నాలుగింటికే ఇస్తానన్నాడుగా" అన్నాడు అసహనంగా.

“అరె.. అన్న టైముకే కరెక్టుగా ఎలా అవుతుంది? కాస్త అటు, ఇటు గాదా”

“అలాంటప్పుడు అయిదింటికే ఇస్తా అని చెప్పొచ్చు గదా” గునిశాడు.

మొత్తం మీద సాయంకాలం సరిగ్గా అయిదింటికి షాపు వద్దకెళ్ళాము. షాపతను అప్పటికే సైకిల్ షాపు బయట పెట్టాడు. ఆయిల్ తో తుడవబట్టేమో నీలం రంగులో, అదే రంగు సీట్ కవర్, బ్రేక్ కవర్లతో, చక్రాల మధ్య రంగు రంగుల పూలతో అందంగా మెరిసిపోతోంది.

“సార్, అన్నదానికంటే మూడు వందలు ఎక్కువయ్యాయి” రేట్లు వేసిన బిల్లులాంటి పేపర్ ఇస్తూ అన్నాడు.

చివరికి పన్నెండు వందలు యిచ్చి సైకిల్ ని బైక్ మీద మధ్యలో పెట్టుకొని ఇంటికివచ్చాము. కాలనీలోకి వస్తుంటే చూడాలి, అదేదో వరల్డ్ కప్ గెలుచుకొని వస్తున్నంత సంతోషం మా వాడి మొఖంలో. ఇక ప్రాక్టీస్ మొదలు పెట్టాలి. వాడు ఆగేట్టు లేడు. ఇంటి ముందు రోడ్డు మీద సైకిల్ దించి బైక్ ఇంట్లో పెట్టాను. సైకిల్ వద్దకు వచ్చి అటూ, ఇటూ నడిపించి బ్రేకులు వేసి చూసాను.

“చిన్నా, సైకిల్ పట్టుకొని కాలనీ మెయిన్ గేటు వద్దకు నడిపించుకుంటూ పోయిరా” అన్నాను.

“అదేంటీ, తొక్కొద్దా..” విచిత్రంగా చూశాడు.

“అరె, ఒకటి రెండు సార్లు నడిపించు, నీకూ దాని మీద అవగాహన వస్తుంది.” సిద్ధాంతంపై పూర్తి పట్టున్న ప్రొఫెసర్ లెవల్లో చెప్పాను. వాడు అసంతృప్తిగానే మా ఇంటిముందునుండి, సైకిల్ నడిపించుకుంటూ కాలనీ మెయిన్ గేటు వరకూ వెళ్ళి, తిరిగి ఏడుపు మొఖంతో వచ్చాడు. మధ్యలో ఒక ఇంటిలోని పిల్లవాడొకడు,

“అరేయ్ చింటూ! సైకిల్ ఉన్నదీ ఎక్కి తొక్కడానికి, దాని ప్రక్కనే మనం నడిచే దానికి సైకిల్ ఎందుకూ?” అని వెక్కిరించాట్ట.

“సరే నీ ఇష్టం పట్టు”అని వాడిని సైకిల్ పై కూర్చోబెట్టి కుడి చేత్తో వెనుక క్యారేజీ, ఎడమ చేత్తో హ్యాండిలూ పట్టుకొని, ఇక తొక్కమన్నాను. అటూ ఇటూ రోడ్డుపై రెండు రౌండ్లు వేసి, ముందు బ్రేకు వేయవద్దని, వెనుక బ్రేకు వేయడం చూపించి, తరువాత చిన్నగా హ్యాండిల్ బార్ వదిలేశాను. కానీ మాటి మాటికీ హ్యాండిల్ వంకరగా పోతోంది. “సరిగ్గా పట్టుకో... ముందుకే చూడూ.. కాళ్ల వైపు చూసుకోవద్దు” అని సూచనలు ఇస్తూ వెనుక క్యారేజీ పట్టుకొని సైకిలెనకాలే పరిగెత్తసాగాను.

మాటికీ కాలనీ రోడ్డుపై ఏదో ఒక బండో, కారో రావడం , మేము ఆగడం, అవి వెళ్ళే వరకూ ఉండి , మళ్ళీ సాధన మొదలెట్టడం .... చీకటి గూడా పడింది. కాలనీ లైట్ల వల్ల రాత్రయిన విషయం పెద్దగా తెలియట్లేదు.

“ఇప్పటికి చాల్లే చిన్నా! ఈ సారి ఆదివారం చూద్దాం” అని సాధన ముగించాము.

అంతే మరి ఈ నాటి చదువుల్లో.. వీళ్లకి వేరే రోజుల్లో విరామమెక్కడిది?

అలసి పోయాడేమో, ఆ రోజు త్వరగా నిద్ర పోయాడు. బహూశా కలలో కూడా పగలు చూసిన సినిమాలో హీరో లీమిల్లర్ గుర్తుకొచ్చి ఉంటాడు.

చూస్తుండగానే నాకు ఆఫీస్, వాడికి స్కూలూ... ఆరు రోజులు గడిచిపోయాయి. మళ్ళీ ఆదివారం రానే వచ్చింది. ఈ లోపులో వాడి సైకిల్ సాధనకు అనుకూలమైన స్థలం చూసాను. అది మా టౌన్ చివర్లో ఉన్న మిషనరీ చర్చి మైదానం. బాగానే పెద్దది. అనుమతి కూడా తీసుకున్నాను. పొద్దున్నే టిఫిన్ చేసి ఇద్దరం వాడి సైకిల్ తీసి, బైక్ మీద పెట్టుకొని అక్కడకు చేరుకున్నాము. ఆ పెద్ద గ్రౌండ్ లో ఒక మూలన ఉన్న చర్చిలో ప్రార్థనలు జరుగుతున్నాయి. మేం మైదానంలో మరో పక్కకు చేరుకున్నాం. సైకిల్ కిందకు దించి, బైక్ దూరంగా పెట్టి వచ్చాను. నేను ఒకసారి సైకిల్ ఎక్కి కూచొని, ఎలా తొక్కాలి, ఎలా బ్రేకు వేయాలి, ముందు బ్రేకు ఎందుకు వేయొద్దూ... అంటూ సూచనలు ఇచ్చి, వాడిని సీటు పై కూర్చోబెట్టి తొక్కమన్నాను. ఫరవాలేదు, బాగానే తొక్కుతున్నాడు. హ్యాండిల్ కూడా బ్యాలన్స్ అవుతోంది. ఒక గంట తరవాత,

“ బాగా తొక్కుతున్నావు, గుడ్, అలాగే .. అలాగే” అంటూ చిన్నగా అప్పటివరకూ వెనుక పట్టుకున్న క్యారేజ్ వదిలేశాను. వాడు సైకిల్ సూటిగా తొక్కుతూ పోయి ప్రహరీ గోడకు గుద్ది కింద పడ్డాడు. వాడు లేచి..

“నాన్నా, ఎందుకు వదిలేశావు?” కోపంగా అన్నాడు.

" బాగానే తొక్కుతున్నావు గదరా... చూడు ఎంత దూరం తొక్కావో.. అయినా కాళ్ళు అందుతున్నాయి గదా బ్రేకు వేసుకోవచ్చుగా" ఎదురు ప్రశ్నించాను. అలిగాడు. కొంచెం సేపు కూచొని, "సరే, ఇప్పటికి ఇంటికి పోయి, అన్నం తినొద్దాం, కాస్త చల్ల బడ్డాక వద్దాం" అని పక్కనే గోడ వెంబడి సైకిల్ పెట్టి తాళం వేసి, బైక్ పై ఇంటికి వచ్చాం.

స్నానం చేసి అన్నం తిన్నాం. సాయంత్రం నాలుగున్నరకు మళ్ళీ గ్రౌండ్ కు వచ్చాం. సాధన మొదలైంది. సైకిల్ తొక్కుతున్నాడు గానీ ఎంతసేపటికీ నేను వెనుక పట్టుకొని ఉన్నానా, లేదా అని చూసుకుంటున్నాడు. నేను సైకిల్ పక్కనే లేకపోతే ఆగిపోతున్నాడు.

" నా వైపు చూడకు, హ్యాండిల్ బ్యాలన్స్ చెయ్యి, అవసరమైతే బ్రేక్ వేసుకో.." అని అరుపుల సలహాలు ఇస్తున్నాను. అయినా వాడు వెనక్కి తిరిగి చూడటం మానలేదు. నాకూ విసుగు వచ్చింది. అప్పటికి చీకటి గూడా పడింది. సైకిల్ అక్కడే ఉన్న షెడ్ లో పెట్టి తాళం వేసి ఇంటికి వచ్చాము.

" ఏం చిన్నా, సైకిల్ తొక్కడం వచ్చిందా?" వాళ్లమ్మ అడిగింది.

వాడు సమాధానం చెప్పలేదు.

"ఫరవాలేదు బాగానే తొక్కుతున్నాడు, ఈ సారి ఆదివారానికి వచ్చేస్తుంది." అన్నాను.

కానీ ఈసారి ఆదివారం అదే కథ. సైకాలజీ గురించి బాగా మాట్లాడుతుంటాడు గదా అని, మా కొలీగ్ తో మా వాడి సైక్లింగ్ విషయం చర్చిస్తే, అతను అదేదో సైకోమోటర్ రిటార్డేషన్ అనీ, మోటార్ మెంటల్ రిటార్డేషన్ అని, సైకిల్ నేర్పడం కంటే కఠినమైన పదాలు వాడి, ఏవేవో ఫోబియాల గురించి చెప్పాడు.

చూస్తుండగానే మరో ఆదివారం కూడా వచ్చేసింది. ఈ రోజు ఎలాగైనా వాడికి సైకిల్ తొక్కడం నేర్పాలి. నూటొక్కటో సారి అనుకున్నాను. ఎప్పటిలాగే చర్చి కాంపౌండ్ కి వెళ్లాం. సైకిల్ సీటు పై వాడిని కూచోబెట్టి, నేనూ వెనుకే పరిగెత్తసాగాను. బాగానే తొక్కుతున్నాడు. నేను వదిలేసినట్లనిపించగానే ఆగిపోతున్నాడు.

మధ్యలో " నాన్నా... వదిలిపెట్టొద్దు" అంటూ తొక్కుతున్నాడు.

ఎండ క్రమంగా పెరుగుతోంది. ఇద్దరికీ చెమట్లు కారిపోతున్నాయి.

ఫరవాలేదు, బానే తొక్కుతున్నాడు. వెనుకే పరిగెడుతూ నెమ్మదిగా క్యారేజ్ వదిలేశాను.

"వెరీ గుడ్, బాగా తొక్కుతున్నావ్, అలాగే తొక్కు... " వెనుకనే పరుగెడుతూ ఉత్సాహ పరిచాను. అరనిమిషం అయిందో లేదో వాడు వెనక్కిచూశాడు. వెంటనే సైకిల్ పట్టుకుని...

" నేను వదిలి పెట్టలేదు,నువ్ తొక్కు" అన్నాను.

వాడు తొక్కుతున్నాడు. నేను చేయి నెమ్మదిగా వదిలేశాను. మళ్లీ వెనక్కి చూసాడు. కాళ్ళు కింద పెట్టి సైకిల్ ఆపాడు. నాకు పిచ్చి కోపం వచ్చింది. సైకిల్ గట్టిగా పట్టుకొని నిలబెట్టి, వీపు మీద ఒక్కటి చరిచాను.

"వెధవా, వెనక్కి చూడొద్దంటే అర్థం గావట్లేదా, వెనక్కి చూస్తూ ముందుకు ఎలా తొక్కుతావు. ఇక్కడే ఉన్నాను గదా, మళ్ళీ వెనక్కి చూడు నీ సంగతి చెబ్తా... వేలెడంత లేని పిల్లలు సైకిళ్ళు తొక్కుతున్నరు, ఇంతున్నవ్, నీకేమైంది, ఎక్కు" అరిచాను.

వాడు సైకిల్ ఎక్కాడు. కానీ హ్యాండిల్ సరిగా నిలబడట్లేదు. కాసేపటికే, వాడి మొఖం చూసి నాకూ జాలిగా అనిపించింది. నాపై నాకే కోపం వచ్చింది. "సైకిల్ తొక్కడం రాకపోతే ఏం... ఈ మాత్రానికే వాణ్ని కొట్టాలా.. ఎప్పుడో అప్పుడు వాడే నేర్చుకుంటాడు" అనుకున్నాను.

" చిన్నా....ఇప్పటికి చాల్లే, ఈ సారి చూద్దాం" అని సైకిల్ అక్కడే ఉంచి ఇంటికి వచ్చాం.బైక్ మీద సైలెంట్ గా కూచున్నాడు. సైడ్ మిర్రర్ లో వాడి కళ్ళు ఏడ్చి ఎర్రగా కన్పిస్తున్నాయ్. ఇంటికి వస్తూనే బాత్ రూంలోకి పరుగు దీశాడు. స్నానం చేసి వచ్చాడు.

"ఏమైందిరా, అలా ఉన్నావు?" వాళ్లమ్మ అడిగింది.

ఏమీ లేదన్నట్లు తలూపాడు. నిశ్శబ్దంగా అన్నం తిన్నాడు.

" చిన్నా, శేషు మామ ఇంటికి వెళ్దామా?"

శేషువాళ్లు మా టౌన్ కి రెండు మైళ్ల దూరంలోనే ఉంటారు. ఫ్యామిలీ ఫ్రెండ్స్. పదినిమిషాల్లో మేం ముగ్గురం వాళ్లింటికి వెళ్ళాం. అందరూ ఇంట్లోనే ఉన్నారు.

" చుట్టాలు వస్తున్నారోయ్, చాలాకాలానికి తీరింది వీళ్లకి! పిల్లలూ, మీ ఫ్రెండ్ చిన్నా వచ్చాడు" అంటూ భార్యను, పిల్లలనూ కేకేశాడు.

"ఏరా, చిన్నా, బాగున్నావా? అలా ఉన్నావేంటీ? మీ నాన్నేమైనా కొట్టాడా?" అడిగాడు.

చిన్నా అడ్డంగా తలూపుతూ " మా నాన్న నన్నసలు కొట్టడు తెలుసా?" బుంగమూతితో అన్నాడు. నాకు ఎక్కడో చురుక్కుమంది.

"అవున్రా, నిజమే... నాన్నలు అసలు కొట్టరు, కొట్టినట్లు నటిస్తారు అంతే...." నా వైపు చూస్తూ గట్టిగా నవ్వేశాడు. వీపు రుద్దుకుంటూ వీడూ నవ్వేడు.

కాసేపటికే పిల్లలు ఆటల్లో పడ్డారు.

సాయంత్రానికి ఇంటికొచ్చాం. వచ్చిన గంటకే ఫోన్. ఆఫీస్ పని మీద, మూడు రోజులు క్యాంప్. ఉదయం చీకటితోనే వెళ్లి పోయాను. వెళ్లిన పనులన్నీ ముగించుకొని మూడో రోజు త్వరగా బయల్దేరాను. ఇంకా అర్ధగంటలో ఊరు చేరతాననగా ఇంటికి ఫోన్ చేశాను, వస్తున్నానని. బస్టాండ్ లో దిగేసరికి రాత్రి తొమ్మిదయింది. బస్టాండ్ నుండి కాలనీ పావుగంట నడక దూరమే. వేగంగా నడుస్తూ చేతిలో బ్రీఫ్ కేసుతో కాలనీ మెయిన్ గేట్ లోకి ప్రవేశించాను. వాచ్ మెన్ ని పలకరించి, గబాగబా నడవసాగాను.

వెనుక నుండి ట్రింగ్, ట్రింగ్ మని సైకిల్ బెల్ . రోడ్ మీది నుండి పక్కకు జరిగి నడవసాగాను. సైకిల్ నా ముందునుండి వెళ్ళి పోయి, ఆ రోడ్ చివరకంటా వెళ్ళి, తిరిగి మళ్ళీ బెల్లు కొట్టుకుంటూ నా వెనుకే వచ్చింది.

"ఎవర్రా అది" అనుకుంటూ రోడ్డు పక్కన ఆగాను. పెద్దగా నవ్వుతూ చిన్నా.

"నాన్నా" అంటూ సైకిల్ పై మళ్ళీ వేగంగా వెళ్లిపోయాడు.

తిరిగి మళ్ళీ నా వెనుకే.."'అరె, నువ్వు... సైకిల్ ... ఎలా?"

మళ్ళా ఒక చుట్టు చుట్టొచ్చి నా పక్కనే ఆగి, సైకిల్ వెనుక క్యారేజ్ వైపు చూపిస్తూ 'ఎక్కుతావా?' అన్నాడు.

"ఆ(... నిన్నూ ..." అంటూ పెద్దగా నవ్వాను, వాడు కూడా.

నేను ఇంటికి వచ్చేంతవరకు వాడు సైకిల్ పై వెనక్కి, ముందుకి తిరుగుతునే ఉన్నాడు.

ఇంట్లోకి వస్తూనే " మీ ఫోన్ కాల్ వచ్చినప్పట్నించి వాడు ఇంట్లోకి రావడం లేదు, సైకిల్ పై కాలనీ గేటు దగ్గరకీ, ఇంటి ముందుకీ తిరుగుతునే ఉన్నాడు" భార్యామణి అంది.

"వీడు సైకిలెప్పుడు నేర్చుకున్నాడే...?"

"అదేంటి మీరు కాదా నేర్పింది? నిన్న ఏవో విద్యార్థి సంఘాలు బంద్ చేశాయని స్కూళ్లకి సెలవిచ్చారు. సైకిల్ తెచ్చుకుంటానని వెళ్ళి సాయంత్రానికి వచ్చాడు. అదిగో వాడి మోకాళ్లు చూశారా, ఎలా చీరుకు పోయాయో" ఫిర్యాదు చేసింది.

ఇంతలో వాడు సైకిల్ ఇంట్లో పెట్టి, స్నానం చేసి వచ్చాడు. త్వరత్వరగా అన్నం తిని నిద్రొస్తుందంటూ పడక గదిలోకి వెళ్లి పోయాడు. నేనూ స్నానం పూర్తి చేసి, ఫ్రిజ్ మీదున్న ఆయింట్ మెంట్ అందుకుని వాడి దగ్గరకు వెళ్లాను, అప్పటికే వాడు మంచి నిద్రలో ఉన్నాడు. నిద్రలోనే నవ్వుతున్న వాడి మోకాళ్ల మీద ఆయింట్ మెంట్ రాస్తుంటే, ఆ రోజు బస్ లో వస్తూ చదివిన మ్యాగజైన్ లో వాక్యాలు గుర్తొచ్చాయి. "పిల్లలకు నేర్పుతున్నామని అనుకుంటాం.. కానీ... నిజమేమిటంటే.. వాళ్లు నేర్చుకుంటారు.. అంతే"

Every child has a different learning style and pace. Each child is unique, not only capable of learning but also capable of succeeding –

★★★

Click here to share your comments on this story